క్లుప్తంగా

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



బీచ్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

బీచ్‌రోడ్డు: కశ్మీర్ పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్ర దాడిలో అమరులైన హిందువులకు నివాళుల ర్పిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్కే బీచ్ నుంచి విక్టరీ ఏట్ సీ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరులకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రదాడిని నాయకులంతా ఖండించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు రవీంద్ర, సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: మే 10, 11 తేదీల్లో నగరంలోని మురళీనగర్‌లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ రెహమాన్ మాట్లాడుతూ సీపీఐ మహాసభలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నగరం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ఎంతో విలువైన భూములను కాపాడడానికి సీపీఐ పోరాటాలు చేస్తోందని చెప్పారు. సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరిలోవ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను నియమించి, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

10వ రోజుకు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

ఎంవీపీకాలనీ: వాల్తేర్ డిపో పరిధిలో డ్రైవర్‌గా విధులు నిర్వరిస్తున్న పి.సిహెచ్.శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. అతడి సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతోపాటు వెంటనే అదే డిపో పరిధిలో విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు సూచించినప్పటికీ డిపో మేనేజర్, ఉన్నతాధికారులు కాలయాపన చేస్తుండటంతో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు దీక్ష చేపట్టారు. పది రోజులవుతున్నా డిపో యాజమాన్యం స్పందించకపోవడాన్ని యూనియన్ నాయకులు తప్పుబట్టారు. శేఖర్‌ను ఇదే డిపో పరిధిలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాలువ



ఇసుకతోట సర్వీస్ రోడ్డు పక్కనున్న కాలువలో పూడిక

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట సర్వీస్ రోడ్డు పక్కన గల కాలువ పూడికలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీనిని శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిపోయింది. సాయంత్రం వేళల్లో దోమలతో పాటు ఈగలు చేరి స్వైర విహారం చేస్తున్నాయి. కాలువ నుంచి వెలువడుతున్న దుర్గంధంతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ కాలువ పక్కనే వున్న చిరు దుకాణాల నిర్వాహకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న పాటి వర్షం కురిసిన ఈ కాలువ పొంగడంతో చెత్త రోడ్లపైకి వచ్చి చేరుతోంది. పారిశుధ్య అధికారులు స్పందించి ఈ కాలువలో పేరుకుపోయిన పూడికలను సకాలంలో తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఆణిముత్యాలు

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- 'తూర్పు'లో అధిక శాతం మందికి ఉత్తమ మార్కులు

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన 2024–25 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తూర్పు నియోజకవర్గంలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు అత్యధిక శాతం మంది 500 మార్కులకు పైగా సాధించి టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. – ఆరిలోవ

తోటగరువు జెడ్పీ హైస్కూల్ 62 శాతం

జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 62 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ ఏడాది 355 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. వారిలో 219 మంది ఉత్తీర్ణులయ్యారు. 35 మంది 500కు పైగా మార్కులు సాధించారు. పూసర్ల సాయి వసంతకుమారి 576/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. తాళపు రెడ్డి ఇంద్ర 573/600, ముద్దాడ రేణుక 570/600 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని భవాని, ఉపాధ్యాయులు అభినందించారు.



తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భాష్యం నూరు శాతం ఉత్తీర్ణత

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–10లోని భాష్యం స్కూల్ పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ జోనల్ ఇన్‌జార్జి జి.వి.ఆంజనేయులు వెల్లడించారు. స్కూల్ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంవీపీ కాలనీ బ్రాంచ్‌లో విద్యార్థిని ఆళ్ల లిఖిత 599/600 మార్కులు సాధించి స్టేట్‌లో సెకండ్ ర్యాంకర్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ బ్రాంచ్ ద్వారా 113 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. 36 మంది 550కి పైగా, 68 మంది 500కు పైగా మార్కులను సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులను ఆంజనేయులు, ఎంవీపీ భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ శిల్ప తదితరులు అభినందించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో భాష్యం జోనల్ ఇన్‌జార్జి ఆంజనేయులు

శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ ప్రభంజనం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. మొత్తం 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. ఆరుగురు 590కి పైగా మార్కులు, 23 మంది 580 పైగా మార్కులు, 81 మంది 550 మార్కులు సాధించిటన్లు పాఠశాల డైరెక్టర్ మోహన్ కృష్ణ తెలిపారు. డి.దైవిక్ 597/600 మార్కులు, ఎస్.వెంకటేష్ 595 మార్కులు, పి.హిమశ్రీ 593, డి.తేజశ్విని 592, ఎం.సాయిప్రసాద్ 590, వి.యుగంధర్ 590 మార్కులతో టాపర్లుగా నిలిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో స్కూల్ డైరెక్టర్ మోహన్ కృష్ణ

కేడీపీఎం హైస్కూల్ 71 శాతం



జె.స్వాతి, 585/600



ఎ.అన్నపూర్ణ, 580/600

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కేడీపీఎం హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. మొత్తం 140 మంది విద్యార్థులకు గానూ 139 మంది పరీక్షలు రాయగా.. వారిలో 98 మంది ఉత్తీర్ణత సాధించారు. 41 మంది ఫెయిలయ్యారు. స్కూల్ మొత్తంగా 71 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ఎన్.సుమతి బాయ్ తెలిపారు. 500కు పైగా 14 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. 585/600 మార్కులతో స్కూల్ టాపర్‌గా జె.స్వాతి నిలిచింది. 580 మార్కులతో ఎ.అన్నపూర్ణ రెండో స్థానం సాధించింది. 56 మంది ఫస్ట్ క్లాస్, 23 మంది సెకెండ్ క్లాస్, 19 మంది థర్డ్ క్లాస్‌లో పాసయ్యారు. తెలుగులో 91 శాతం మంది, హిందీలో 99 శాతం, ఇంగ్లిష్‌లో 96 శాతం, మ్యాథ్స్‌లో 77 శాతం, సైన్స్‌లో 81 శాతం, సోషల్‌లో 88 శాతం ఉత్తీర్ణత సాధించారు.

చంద్రంపాలెం హైస్కూల్లో 66 శాతం..

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 799మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 531మంది ఉత్తీర్ణత సాధించి 66 శాతం ఉత్తీర్ణత పొందారు. 550పైగా మార్కులు 22మంది సాధించగా, 500పై 90మంది సాధించారు. పాఠశాల టాపర్‌గా 584 మార్కులు సాధించి ఎస్.శిరీష నిలవగా, 583 మార్కులతో ఎస్.లావణ్య ద్వితీయ స్థానంలో, 579మార్కులతో కె.తనీష్ సామిత్ తృతీయ స్థానంలో నిలిచారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, ఉపాధ్యాయులు అభినందించారు.



584 మార్కులు సాధించిన శిరీషను అభినందిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రవి

శ్రీకృష్ణాపురం గురుకులం 69 శాతం

జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం గురుకులం 69 శాతం ఉత్తీర్ణత సాధించింది. 58 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. 40 మంది ఉత్తీర్ణులయ్యారు. పొన్నకాయల ఆకాష్ 590/600 మార్కులు సాధించి గురుకులం టాపర్‌గా నిలిచాడు. ఆకాష్‌తోపాటు ఉత్తీర్ణులయిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. మరో ఇద్దరు విద్యార్థులు 531, 510 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.



పొన్నకాయల ఆకాష్, 590/600

ప్రతిభావంతుడు ఆకాష్

గురుకులం టాపర్ పొన్నకాయల ఆకాష్ ఐదో తరగతి నుంచి శ్రీకృష్ణాపురం గురుకులంలో చదువుతున్నాడు. అన్ని పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపుతున్నట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఈ ఏడాది జనవరిలో పాండిచ్చేరిలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి పొందినట్లు చెప్పారు. గతంలో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీల్లో అనేక బహుమతులు అందుకున్నాడన్నారు.

శ్రీ శివశంకర్ విద్యా మందిర్ సత్తా



590 మార్కులు సాధించిన పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సుధా

మద్దిలపాలెం: పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కేఆర్ఎం కాలనీలోని శ్రీ శివశంకర్ విద్యా మందిర్ ప్రధానోపాధ్యాయిని ఎం.వి.సుధా తెలిపారు. ఎన్.పవన్‌కుమార్‌రెడ్డి 590/600 మార్కులతో టాపర్‌గా నిలిచాడన్నారు. డి.పవన్‌సాయి 587/600, ఎం.భార్గవి 586/600, ఎస్కే అబ్దుల్ రెహమాన్ 581/600, సిహెచ్.భావన 580/600 మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. 55 మంది విద్యార్థుల్లో 38 మంది 500కు పైగా మార్కులు సాధించిటన్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

'శ్రీగాయత్రి' విజయ దుందుభి



కె.డి.ఎస్.ఎస్.చరణ్ 594/600



వై.జశ్విత 586/600

మద్దిలపాలెం: పదో తరగతి ఫలితాల్లో మద్దిలపాలెం శ్రీ గాయత్రి విద్యా మందిర్ విజయదుందుభి మోగించిందని ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. విద్యార్థి కె.డి.ఎస్.ఎస్.చరణ్ 594/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడన్నారు. చరణ్ తండ్రి సాధారణ దినసరి కూలీగా పనిచేసుకుంటూ కుమారుడి చదివించారని చెప్పారు. వై.జశ్విత 586/600 మార్కులు సాధించిందన్నారు. ఈ విద్యార్థిని తండ్రి పాన్‌షాప్ నడుపుతూ కుమార్తెను చదివించారని తెలిపారు. మరో ఐదుగురు విద్యార్థులు 584 మార్కులు, మరో ముగ్గురు 583, 581, 580 మార్కులు సాధించారన్నారు.

అలరించిన ఎస్.జానకి చిత్ర గీతాల విభావరి

గాయని సువశ్రీ బాగ్చికి ఎస్.జానకి అవార్డు ప్రదానం

మద్దిలపాలెం: ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి 87వ జన్మదిన వేడుకలు బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యాక్మి, జయంతి చౌదరి క్రియేషన్స్ ఎంవీఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఎస్.జానకి సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఎస్.జానకి పాడిన చిత్రాల్లోని గీతాలను గాయకులు కల్యాణి, సత్య, అనూష, సుజాత, ఆనంద్, రుద్రవేణి, శశిభూషణ్ ఆలపించి అలరించారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సతీమణి, గాయని, నృత్య దర్శకురాలు సువశ్రీ బాగ్చికి ఎస్.జానకి పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, విద్యా వేత్త ఉషా చీరాల, నిర్వాహకులు యాక్మి ప్రతాప్, ఎం.వి.ఆర్.నాగేశ్వర రావు, వ్యాఖ్యాత జయంతి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సువశ్రీ బాగ్చిని ఎస్.జానకి అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో వింత కంచె

ఏయూక్యాంపస్: వెదురు కర్రలు, పాత వస్త్రమే అక్కడ కంచెగా వినియోగిస్తున్నారు. బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్‌లో ప్రవేశం వద్ద కనిపించే దృశ్యం ఇది. రహదారి పక్కనే ఉన్న లాన్‌లోకి వెళ్లే మార్గం చుట్టూ కంచె వంటిని ఏర్పాటు చేశారు. ఫుట్‌పాత్‌ను ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో వెదురు కర్రలు నాటి, దానికి పాత వస్త్రం పీలికలను తాడులా కట్టారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ పార్క్‌లో ఇటువంటివి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. నిత్యం వేలాది మంది సందర్శించే ఈ పార్క్‌లో ఈ ఏర్పాట్లు కొంత ఇబ్బందికరంగా ఉంటున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు వీటిని సూచి ఎలా అర్థం చేసుకోవాలో తెలియని పరిస్థితి. పాత వస్త్రం పీలికనుతొలగించి అవసరమైతే కొబ్బరి తాడు, ప్లాస్టిక్ తాడు, నెట్‌తో వీటిని రక్షణ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులు పార్క్ నిర్వహణ, సుందరీకరణపై ప్రత్యేక దృష్టి చూపాల్సిన అవసరముంది.



వీఎంఆర్‌డీఏ పార్క్‌లో వెదురు కర్రలకు పాత వస్త్రాలు కట్టి ఏర్పాటు చేసిన కంచె

స్టీల్‌ప్లాంట్ 'స్ట్రాటజిక్ సేల్' రద్దు చేయాలి

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం పార్లమెంట్‌లో ప్రకటించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1,475వ రోజుకి చేరుకున్నాయి. ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నిందన్నారు. దీనిని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ డబ్బును ప్లాంట్ ఉత్పత్తికి, యంత్రాలకు, ముడి సరకులకు, కార్మికుల జీతభత్యాలకు చెల్లించకుండా రూ.1140 కోట్లు బ్యాంకు అప్పులు చెల్లించారని తెలిపారు. ఇందులోనే రూ. 500 కోట్ల రూపాయలు జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని, రూ.6700 కోట్లు ఇతర అప్పులు తీర్చగా మిగిలింది 3 వేల కోట్లు అని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌లో 1100 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపుతున్నారని, 5400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు సిద్ధపడ్డారన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ విధుల్లో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ తదితరులు

ముఖ్యమంత్రికి ప్లాంట్‌పై ఉన్న ప్రేమ ఇదేనా?

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, అనకాపల్లి జిల్లాలో ఇంకా నిర్మాణం కాని ఆర్సెలర్ మిట్టల్ కంపెనీకి సొంత గనులు కేటాయించమని ప్రధాని మోదీని రాష్ట్ర ముఖ్యమంత్రి అడగడం చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆయనకున్న ప్రేమ అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. 8500 మంది నిర్వాసితులందరికీ తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకులు కె.మణి, కె.కుమారి, బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, ఎల్.కామేశ్వరి, స్వర్ణలత, పి.శారద, సింహాద్రప్పడు మాస్టారు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.